క్లుప్తంగా

వైఎస్సార్ ఆసరా కార్యక్రమం రేపు

రేగిడి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఈ నెల 4వ తేదీన వైఎస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహన్‌రావు ఓ ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పాల్గొంటారని, లబ్ధిదారులంతా విచ్చేసి, కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు.

'జగనన్నే మా భవిష్యత్' కిట్ల పంపిణీ



జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమ కిట్లు అందజేస్తున్న జేసీఎస్ కన్వీనర్ శంకరరావు

బాడంగి: మండలంలోని బొత్సవానివలస, పాల్తేరు, గూడెపువలస గ్రామ సచివాలయాల పరిధిలోని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లకు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి సంబంధించిన కిట్లు ఆదివారం పంపిణీ చేశారు. మండల జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు, ఎంపీపీ సలహాదారు తెంటు మధుసూదనరావు మాట్లాడుతూ ఏప్రిల్ ఏడో తేదీ నుంచి వారం రోజుల పాటు జరిగే జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరించాలని వారికి సూచించారు. నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించాలన్నారు.

ఒత్తిడి జయిస్తే ఉత్తమ ఫలితాలు



మాట్లాడుతున్న ఎస్ఐ లోకేశ్వరరావు

వంగర: పదో తరగతి విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఎస్ఐ బుడుమూరు లోకేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక వివేక్ మాస్టర్ మైండ్స్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని, పలు సూచనలు చేశారు. సిలబస్ ప్రకారం చదవాలని, మొదట పరీక్షలంటే భయం వీడాలన్నారు. విద్యార్థులందరికీ ఆల్ ది బెస్ట్ అని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బెవర ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

15 మద్యం సీసాల స్వాధీనం

బొబ్బిలి: అక్రమంగా మద్యంబాటిళ్లు తరలిస్తున్న మండలంలోని హరిజన పాల్తేరుకు చెందిన చింతాడ వెంకయ్య అనే వ్యక్తిని అరెస్ట్ చేసి, 15 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్ఐ గుంట్రెడ్డి భాస్కరరావు తెలిపారు. సదరు వ్యక్తిని ఆదివారం కోర్టులో హాజరు పరచగా, న్యాయమూర్తి 10 రోజుల రిమాండ్ విధించినట్లు ఆయన పేర్కొన్నారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు



తెర్లాం: ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

తెర్లాం: మండలంలోని నందబలగ గ్రామంలో కొలువైన దుర్గాదేవికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రతీ ఆదివారం ఆలయంలో ఈ ప్రత్యేక పూజలు చేస్తుండడం గమనార్హం కాగా నందబలగతో పాటు తెర్లాం, బాడంగి, మెరకముడిదాం మండలాల్లోని పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి, అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

మోదీవి ప్రజావ్యతిరేక విధానాలు



చలో ఢిల్లీ కార్యక్రమ వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నేతలు

బొబ్బిలి: ప్రధాని నరేంద్ర మోదీవి ప్రజావ్యతిరేక విధానాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.వై.నాయుడు ఆరోపించారు. స్థానిక రైల్వే స్టేషన్‌లో ఈ నెల 5వ తేదీన జరిగే చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం కార్యక్రమానికి హాజరయ్యేందుకు రైలులో ఢిల్లీకి పయనమైన విజయనగరం జిల్లాలోని రామభద్రపురం, బొబ్బిలి, పార్వతీపురం మన్యం జిల్లాలోని సాలూరు, సీతానగరం ప్రాంతాల కార్మికులకు సంఘీభావం తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పాలనా తీరును నిరసిస్తూ ఈ నెల 5వ తేదీన పార్లమెంట్ భవనం ఎదురుగా చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమంలో అందరూ పాల్గొని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నేత సురేష్, రైతు సంఘం నాయకుడు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఆవుపేడతో ప్రయోజనాలు..

- సేంద్రియ ఎరువుగా పొలాల్లో వినియోగం
- చీడపీడల నివారణతో పాటు మొక్కలకు పోషకాలు అందేలా
- భూసారం పెంపు, అధిక దిగుబడులకు దోహదం



పొలంలో వేసేందుకు పశువుల పేడను ట్రాక్టర్‌లో లోడు చేస్తున్న దృశ్యం

రాజాం సిటీ: ఆవుపేడేనని తేలిగ్గా తీసేయొద్దని అంటున్నారు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు. ఇంటి ముందు ఆవరణలో పేడను నీటితో కలిపి కల్లాపి చల్లితే సూక్ష్మజీవులు దరిచేరకుండా ఉంటాయి.. ఇంటిల్లపాది రోగాల బారినపడకుండా ఆరోగ్యంగా ఉంటాం. అదే పేడను పొలాల్లో వేస్తే సేంద్రియ ఎరువుగా ఉపయోగపడి భూసారం పెంచడంతో పాటు సాగులో అధిక దిగుబడులను ఇస్తుంది. ప్రస్తుతం వ్యవసాయంలో రసాయన ఎరువుల వినియోగం విపరీతంగా పెరిగిపోతుండడంతో భూమిలోని పోషకాల సమతుల్యం లోపిస్తోంది. ఫలితంగా ఉత్పాదక శక్తి తగ్గుతోంది. సాగుకు చీడపీడలు ఆశించడం, సూక్ష్మ పోషకాల లోపాలతో పంట దిగుబడులు పడిపోతున్నాయి. ఈ సమస్యను అధిగమించాలంటే సేంద్రియ పద్ధతులను తప్పనిసరిగా ఆచరించాలని రాజాం వ్యవసాయశాఖ ఏడీ కె.చంద్రరావు సూచిస్తున్నారు.

దుక్కులకు ముందే...

పశువుల పేడతో పాటు గొర్రెలు, మేకల పేడ కూడా పంటల సాగుకు ఎంతగానో ఉపయోగపడతాయి. ఇవి సేంద్రియ ఎరువుతో సమానం. దీన్ని దుక్కులు దున్నడానికి ముందే పంట భూముల్లో వేసి ఆ తర్వాత దున్నాలి. ఇలా చేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చు. దుక్కులు దున్నిన తరువాత పేడ భూమిలో కలిసిపోయి పంట దిగుబడి పెరగడానికి దోహదపడుతుంది.



చంద్రరావు

తేమ ఉన్న సమయంలోనే...

సాధారణంగా రైతులు వేసవిలో పశువుల ఎరువును పొలాల్లో వేస్తారు. అధిక ఎండల సమయంలో ఎరువులు పొలంలో చల్లితే వాటిలోని పోషకాలు ఆవిరి రూపంలో పోతాయి. అందుకే పశువుల పేడను పొలంలో కుప్పలుగా పోసుకోవాలి. భూమిలో అవసరమైనంత తేమ ఉన్న సమయంలోనే ఆ కుప్పలను పొలంలో చల్లి, వెంటనే దున్నుకోవాలి. దీంతో భూసారం పెరుగుతుంది. నేలలోని అధిక ఆమ్లత్వం, క్షారత్వం, నీటిని నిల్వ ఉంచే గుణాన్ని అదుపు చేసి, పోషకాలను మొక్కలకు అందుబాటులో ఉండేలా సహకరిస్తుంది. మొక్కల వేరు వ్యవస్థ పెరుగుదలకు కూడా తోడ్పడుతుంది.

ఇలా దున్నాలి..

దుక్కిని ఎలా పడితే అలా దున్నడం వల్ల సాగుచేసే పంటలకు నష్టం వాటిల్లుతుంది. ఖరీఫ్ సీజన్ సాగు కోసం వేసవిలో మెట్టభూములను రైతులు సన్నద్ధం చేస్తుంటారు. మెట్ట ప్రాంతాల్లో భూమి వాలుకు అడ్డంగా దుక్కి చేయాలి. ఇలా చేయడం ద్వారా వేసవిలో వచ్చే వర్షాలకు, వరదలకు సారవంతమైన మట్టి కొట్టుకుపోకుండా ఉంటుంది. రైతులు ఎప్పటికప్పుడు సాగుకు సంబంధించిన సలహాలు, సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని అంటున్నారు.

ఘనంగా మట్టల ఆదివారం



తెర్లాం: క్రీస్తు ప్రార్థనా మందిరంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు



బాడంగి: బైబిల్ వాక్యం వినిపిస్తున్న ఫాదర్ సురేష్ కుమార్



బొబ్బిలిలో క్రీస్తు సందేశం ప్రచారం చేస్తున్న భక్తులు

తెర్లాం: మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏసుప్రభువు యెరూసలేంలో ప్రవేశం పురస్కరించుకుని, ఏటా ఈ కార్యక్రమం జరుపుతుండడం ఆనవాయితీగా వస్తోంది. ఉదయాన్నే క్రీస్తు భక్తులంతా మట్టలు చేతపట్టుకుని, వీధుల్లో తిరుగుతూ ఏసుక్రీస్తునకు జయం జయం, రాజుల రాజుకు జయం అంటూ నినాదాలు చేస్తూ ప్రభు సువార్తను ప్రకటించారు.

బాడంగి: మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లోని క్రీస్తు ప్రార్థనా మందిరాల ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ ముగడ సురేష్‌కుమార్ మట్టల ఆదివారం ప్రాముఖ్యత, క్రీస్తు సందేశం తెలియజేశారు. అంతకుముందు క్రీస్తు ఆరాధికులంతా మట్టలతో వీధుల్లో తిరిగి, క్రీస్తు గొప్పతనం చాటారు. ఆయన బోధనలు ప్రపంచ శాంతికి దోహదం చేస్తాయని, ఆయనే యావత్తు జగతికి ఏకైక ప్రభువని అన్నారు. వచ్చే శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా క్రీస్తు శిలువ మోయడాన్ని నాటకీయంగా ప్రదర్శిస్తామని భక్తులు తెలిపారు. శని, ఆదివారం క్రీస్తు పునరుత్థాన పండగ(ఈస్టర్) చేపడతామన్నారు.

బొబ్బిలి: మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాస్టర్ అశోక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో క్రైస్తవ సోదరులంతా మట్టలు చేతపట్టుకుని, వీధుల్లో తిరిగారు. క్రీస్తు సందేశం, మట్టల ఆదివారం ఆవశ్యకత వివరించారు.

అందుబాటులో అన్నిరకాల వైద్యసేవలు



ఆస్పత్రి ఎండీ రాజేంద్రకు జ్ఞాపిక అందించి సత్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

- కేర్ హాస్పిటల్ వార్షికోత్సవంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

రాజాం సిటీ: రాజాం ప్రాంత ప్రజలకు అన్నిరకాల వైద్యసేవలు అందుబాటులోకి తీసుకువచ్చిన జీఎంఆర్ కృషి అభినందనీయమని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం స్థానిక జీఎంఆర్ ఐటీలో వరలక్ష్మీ కేర్ ఆస్పత్రి 12వ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వైద్యులు దేవుళ్లతో సమానమని, అందుకే వైద్యో నారాయణోహరి అని పెద్దలు అంటుంటారని గుర్తు చేశారు. గ్రంధి మల్లిఖార్జునరావు ముందుచూపుతోనే మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఆస్పత్రి నెలకొల్పారన్నారు. నాణ్యమైన విద్యతో పాటు వైద్యాన్ని కూడా అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. గతంలో ఏ చిన్న చికిత్స చేసుకోవాలన్నా విశాఖపట్నం వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు అందరికీ అన్ని వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. జీఎంఆర్ రాజాం వాసి కావడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమన్నారు. ఆస్పత్రి, కళాశాలలు స్థాపించి, ఎంతోమందికి ఉపాధి అవకాశాలు కల్పించారని తెలిపారు. ముమ్ముందు మరిన్ని సేవలు ప్రజలకు చేరువ చేయాలని ఆకాంక్షించారు. అనంతరం ఆస్పత్రి సిబ్బందికి జెడ్పీ చైర్మన్ జ్ఞాపికలు అందజేసి, సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు, గ్రంధి నీలాచలం, ఆస్పత్రి ఎండీ దామెర రాజేంద్ర, జీఎంఆర్ ఐటీ ప్రిన్సిపాల్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

- ఎమ్మెల్యే కంబాల జోగులు



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగులు

రాజాం: పేదలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం నిలుస్తోందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో రాజయ్యపేటకు చెందిన జి.శ్రీదేవికి మంజూరైన రూ.2.20 లక్షల చెక్కును ఆమె భర్త ప్రసాద్‌కు ఎమ్మెల్యే ఆదివారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా అనేక వ్యాధులకు చికిత్స అందించడం జరుగుతోందని అయితే ఆరోగ్యశ్రీ వర్తించని పలువురు పేదలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ సాయం సకాలంలో అందిస్తున్నారని తెలిపారు. గతంలో టీడీపీ నాయకులు, వారి కార్యకర్తలకు మాత్రమే సీఎం రిలీఫ్ ఫండ్ సాయం అందేదని, ఇప్పుడు అలా కాదని సామాన్యులు కూడా తమ వైద్య ఖర్చుల నిమిత్తం దరఖాస్తు చేసిన వెంటనే ఈ ఆర్థికసాయం అందించడం జరుగుతోందన్నారు. శ్రీదేవి కొడుకు గణసాయి అనారోగ్యం బారినపడి, చికిత్స పొందుతున్నాడని, చికిత్స కోసం ఆమె తల్లి శ్రీదేవి సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారని, ఇప్పుడు నగదు మంజూరైందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాజాం రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, సామంతుల తవిటినాయుడు, రామచంద్రరావు, ముదిలి జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

మెంటాడ: మండలంలోని బుచ్చిరాజుపేటకు చెందిన తాడ్డి తిరుపతికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2.50 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును డిప్యూటీ సీఎం, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర సాలూరులో ఆదివారం అందజేశారు. గత కొంతకాలంగా ఆయన గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న విషయాన్ని వైఎస్సార్ సీపీ నాయకుడు లచ్చిరెడ్డి అప్పలనాయుడు డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన చొరవతో నిధులు మంజూరయ్యాయి.

రేగిడి: మండలంలోని సోమరాజుపేటకు చెందిన బూడి లక్ష్మికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.1.25 లక్షల చెక్కును ఎమ్మెల్యే కంబాల జోగులు ఆదివారం అందజేశారు. ఆమె భర్త ముత్యాలనాయుడు అనారోగ్యంతో కొన్నాళ్ల క్రితం మృతి చెందగా, ఆయన వైద్య ఖర్చుల నిమిత్తం ఆమె పెద్దఎత్తున ఖర్చు చేసింది. ఈ క్రమంలో ఆర్థికసాయానికి సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా, నగదు మంజూరు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, సర్పంచ్ నవలాపురపు రమేష్‌నాయుడు, ఎంపీటీసీ పాగిరి అప్పలనాయుడు పాల్గొన్నారు.



మెంటాడ: సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

పకడ్బందీగా 144 సెక్షన్ అమలు

రేగిడి: మండలంలోని సంకిలి, రేగిడి, లక్ష్మీపురం, అంబాడ, వెంకటాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షల కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఎస్ఐ ఇ.శ్రీనివాస్ ఆదివారం విలేకరులకు తెలిపారు. ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు పరీక్ష ఉంటుందని, పరీక్ష జరుగుతున్న సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కేంద్రాలకు 200 మీటర్ల లోపు ఎటువంటి జిరాక్స్ షాపులు, నెట్ సెంటర్లు ఉండరాదన్నారు. ఒకవేళ ఉంటే పరీక్ష సమయానికి గంట ముందే దుకాణాలు మూసివేయాలని, పరీక్ష తర్వాత మళ్లీ తెరుచుకోవచ్చన్నారు. విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడకుండా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. పరీక్ష కేంద్రాలకు వచ్చిన విద్యార్థులను ఎవరైనా ఇబ్బందులు పెడితే చర్యలు తప్పవన్నారు.

బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు

- సీఐ తిరుమలరావు



మాట్లాడుతున్న సీఐ తిరుమలరావు

రామభద్రపురం: ఐపీఎల్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ తిరుమలరావు హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్ఐ సురేంద్రనాయుడుతో కలిసి ఆదివారం విలేకరులతో మాట్లాడిన ఆయన వినోదం కోసం నిర్వహించే క్రికెట్ పోటీలను కొందరు జూదరులు కల్పతరువుగా మార్చుకుంటున్నారని అది మంచిది కాదన్నారు. బెట్టింగులకు పాల్పడి డబ్బులు పోగొట్టుకున్న వారు చెడువ్యసనాలకు బానిసలవ్వడంతో పాటు ఆత్మహత్య చేసుకునే అవకాశం ఉందన్నారు. ఇప్పుడు గ్రామాలకు కూడా ఈ జాడ్యం పాకిందని, నిఘా పెడుతున్నామన్నారు. ఎవరు పట్టుపడినా కఠిన చర్యలు తప్పవన్నారు.

భారీ వాహనాలతో ట్రాఫిక్ అవస్థలు

రామభద్రపురం: మండల కేంద్రం మీదుగా భారీ వాహనాల రాకపోకలతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రతిరోజూ ఏదో ఒక సమయంలో ఇటువంటి పరిస్థితి నెలకొనడంతో అటువైపుగా ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో తమ గమ్య స్థానాలకు చేరుకోలేకపోతున్నారు. గంటల తరబడి అలాగే రోడ్లపై ఉండిపోవాల్సి వస్తోందని వాపోతున్నారు. ముఖ్యంగా రామభద్రపురం నుంచి సాలూరు వెళ్లేందుకు బస్సులు, అటువైపుగా ఒడిశా వెళ్లేందుకు గ్రామం(రామభద్రపురం) మధ్యలో రోజుకు వందల కొలది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. గ్రామం చివరలో ఎన్‌హెచ్-26 బైపాస్ రోడ్డు ఉన్నా అటువైపుగా వెళ్లకుండా గ్రామం మధ్యలోనే రాకపోకలు సాగిస్తుండడంతో గ్రామస్తులు, వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న మురుగునీటి కాలువలు పూర్తిగా శిథిలం కావడంతో పాటు రోడ్డుకు ఆనుకుని ఉన్న ఇళ్ల యజమానులు కొంత మేర రోడ్డును ఆక్రమించుకోవడంతో రోడ్డు ఇరుకుగా తయారైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పోలీసులు చెప్పినా భారీ వాహనాలు నడిపే వారు వినడం లేదు. దీంతో స్థానికులకు ట్రాఫిక్ జామ్ ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



భారీ వాహనాల రాకపోకలతో రామభద్రపురం గ్రామ రోడ్డు మధ్యలో నెలకొన్న ట్రాఫిక్ జామ్

కృష్ణవలసలో గ్రామసభ



వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

సంతకవిటి: మండలంలోని కృష్ణంవలస గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామసభ ఆదివారం నిర్వహించారు. గత నాలుగు రోజులుగా ఇదే గ్రామంలో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి, సోషల్ ఆడిట్ నిర్వహిస్తుండగా, ఆడిట్‌లో పరిశీలించిన విషయాలపై గ్రామసభలో చర్చించారు. ఉపాధి వేతనదారులకు అందిన వేతనాలతో పాటు పనులకు వెచ్చించిన నగదు, పనులు జరిగిన తీరు, నాణ్యతను వివరించారు. దీనిపై ఎవరికైనా అభ్యంతరాలుంటే తెలియజేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి, ఏపీఓ త్రినాధరావు, ఈసీ మురళి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



పశువులకు గాలికుంటు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

వంగర: మండలంలోని పెదరాజులగుమ్మడ, చినరాజుగుమ్మడ, వీవీఆర్ పేట, జేకే గుమ్మడ గ్రామాల్లోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఆదివారం వేశారు. వ్యాధి సోకకుండా ముందస్తుగా టీకాలు వేసినట్లు పశువైద్య సిబ్బంది తెలిపారు. వ్యాధి లక్షణాలతో పశువులు బాధపడితే దగ్గరలోని పశువైద్య కేంద్రానికి గానీ సంచార పశువైద్య శాలకు గానీ సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎల్ఎస్ఏ జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

తెర్లాం: విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం' కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా అనేక విషయాలు తెలియడంతో పాటు జ్ఞానం పెంపొందుతుందన్నారు. అలాగే ఏయే పుస్తకాలు చదవాలి, ఎలా చదవాలన్న దానిపై పిల్లలకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.



విద్యార్థితో పుస్తకం చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

సీఎం జగన్ ఆశయ సాధనకు కృషి చేయాలి



సోంపురం సచివాలయంలో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణరావు

- ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు

రామభద్రపురం: ప్రజాసంక్షేమం, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు కోరారు. మండలంలోని నాయుడువలస, సోంపురం గ్రామ సచివాలయాల్లో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో సమావేశమైన ఆయన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమ నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ప్రతీ ఇంటికి వెళ్లి, ప్రభుత్వం ఆ ఇంటికి చేస్తున్న మంచిని వివరించాలన్నారు. అలాగే రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను వివరించాలన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి అందరూ సమష్టిగా పనిచేస్తేనే 2024 ఎన్నికల్లో పార్టీ విజయం సాధ్యమన్నారు. ఆ దిశగా అందరూ పయనించి, సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, సోంపురం, ఇట్లామామిడిపల్లి, నాయుడువలస సర్పంచ్‌లు చొక్కాపు అప్పలనాయుడు, లెంక లక్ష్మి, నడిమింటి లక్ష్మి, ఎంపీటీసీ పప్పల నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.